క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్ శ్రీవీర అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

వేగంగా ఉపాధి హామీ పనులు

మనుబోలు: ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశించారు. అధికారులు, ఎఫ్‌ఏలు, టీఏలు ఇతర సిబ్బందితో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి ఏపీఓ రాజమ్మ, టీఏలు గుర్రప్ప, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌రెడ్డి సేవలతో రెడ్‌క్రాస్‌కు గుర్తింపు

కోవూరు: ఎమ్మెల్సీ, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కారణంగా రెడ్‌క్రాస్‌కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబు రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల మన్ననలను ఆయన పొందుతున్నారని, దీన్ని జీర్ణించుకోలేని కొందరు పనిగట్టుకొని అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అలాంటి వ్యక్తి రాజీనామా చేయడం బాధాకరమని తెలిపారు.

క్రీడా పోటీల్లో ప్రతిభ

కోవూరు: గూడూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన ఇంటర్ కాలేజీయేట్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో గీతాంజలి కళాశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో ప్రతిభ చూపారని కళాశాల కార్యదర్శి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు కళాశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, కబడ్డీ, ఖోఖోలో అత్యుత్తమ ప్రతిభ చూపారని వివరించారు. విశాఖపట్నంలో ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో వీరు పాల్గొననున్నారని చెప్పారు. ప్రిన్సిపల్ సతీష్‌కుమార్, కళాశాల ట్రెజరర్ విజయశంకర్, కళాశాల పీడీ అశోక్‌కుమార్, అడ్మిన్ భీమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'దారి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు'

తోటపల్లిగూడూరు: తన పంట పొలానికి దారి ఇవ్వకుండా కొందరు ఇబ్బంది పెడుతున్నారని చిన్నచెరుకూరు గ్రామానికి చెందిన వేమారెడ్డి రాఘవరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారుల తీరుతో తన పొలానికి వెళ్లే దారి మూసుకుపోయిందన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తాడేపల్లి తరలిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు



కోవూరు: తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశాన్ని పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించనున్నారు. దీనికి నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు మంగళవారం బయల్దేరారు.

తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎంఈఓ

మనుబోలు: సంక్రాంతి సెలవుల్లో ప్రైవేట్ పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. నిబంధనలను ఉల్లంఘించవద్దన్నారు.

పక్కా గృహాలను త్వరితగతిన పూర్తి చేయండి

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణ, రూరల్ మండలాల్లో అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలను మార్చి 31లోపు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ జిల్లా ఈఈ మోహన్‌రావు సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో వివిధ దశల్లో అసంపూర్తిగా దాదాపు 1500కుపైగా పక్కా గృహాలున్నాయని చెప్పారు. గతంలో చేసిన కాంట్రాక్టర్లకు ఎంత బిల్లులు రావాలో తెలుసుకొని వీటిని పెట్టాలని సూచించారు. మార్చి 31లోపు గృహాలను పూర్తి చేయకపోతే రద్దవుతాయని తెలిపారు. అనంతరం బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ, పంచేడులో అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలను పరిశీలించారు. డిప్యూటీ డీఈ వెంకటేశ్వర్లురెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం ఏఈ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ పనులు ఆగిపోయాయ్!



కండలేరులోని సీపీడబ్ల్యూఎస్ మంచినీటి సంప్

- గత ప్రభుత్వంలో 212 పనుల పూర్తి
- 543 పనులతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లే లక్ష్యం
- సీపీడబ్ల్యూ స్కీమ్ నుంచి ప్రత్యేక పైప్‌లైన్

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ అందజేసి మంచినీటిని సరఫరా చేసే లక్ష్యంతో ప్రారంభించిన జల్‌జీవన్ పనులు నిలిచిపోయాయి. నాడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఐదు మండలాలకు కలిపి రూ.117.82 కోట్లు మంజూరు చేయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా 10 శాతం, కేంద్ర ప్రభుత్వ వాటా 90. సర్వేపల్లిలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారుల ద్వారా మొత్తం 543 పనులను గుర్తించి ప్రారంభించారు. 212 పనులను పూర్తి చేయగా మిగిలినవి వివిధ కారణాలతో ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జల్‌జీవన్ మిషన్ పనులను కొనసాగించడం లేదు. గతంలో చేపట్టిన వాటికి సంబంధించి నివేదికలను పరిశీలించి మొదలు కాని పనులు, పురోగతిలో ఉన్న పనులను రద్దు చేసే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. 25 శాతానికి పైబడిన పనులు పురోగతిలో ఉంటే కొనసాగించాలనే ఆదేశాలున్నా తిరిగి చేపట్టడంపై పూర్తిస్థాయిలో స్పష్టత లేకుండా ఉన్నట్టు తెలిసింది.

ప్రతి కుటుంబానికి..

కనీస అవసరాల్లో ఒకటైన తాగునీటిని ప్రతి కుటుంబానికి అందించే ప్రక్రియలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను ప్రవేశపెట్టింది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, నది జలాల వినియోగం, నీటిని శుద్ధి చేయడం వంటి పనులను చేపట్టి ఇంటింటికీ సమృద్ధిగా మంచినీటిని సరఫరా చేయడం లక్ష్యంగా మిషన్ పనులు చేపట్టడం జరుగుతుంది. గత ప్రభుత్వంలో సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పనులు చేపట్టారు. ఇందుకోసం సుమారు రూ.20 కోట్లపైగా నిధులను కూడా ఖర్చు చేశారు. కొన్నిచోట్ల సీపీడబ్ల్యూ స్కీంలకు జల్‌జీవన్ మిషన్ పనులను అనుసంధానించి ప్రత్యేక పైపులైన్ల ద్వారా అవసరమైన గ్రామాలకు తాగునీటిని అందించే పనులు కూడా చేపట్టడం జరిగింది. ఎఫ్‌హెచ్‌టీ (ఫిల్లింగ్ హౌస్‌హోల్డ్ ట్యాప్ కనెక్షన్) కింద ప్రతి ఇంటికీ ఉచితంగా మంచినీటి కుళాయిను బిగిస్తారు. ఇందుకోసం జల్‌జీవన్ మిషన్లో భాగంగా 2020లోనే గ్రామాలను ఎంపిక చేశారు. సర్వేపల్లిలో మరో 100 పనులు పురోగతిలో ఉన్నట్టు అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే 200కుపైగా పనులు ప్రారంభించలేదని కూటమి ప్రభుత్వం రద్దు చేసేందుకు సమాయత్తం అవుతున్నట్టు తెలుస్తోంది.



మర్రిపల్లిలో ఉపయోగంలో లేని వాటర్ ట్యాంక్

ఇక్కడిలా..

పొదలకూరు పట్టణ తాగునీటి అవసరాల కోసం జల్‌జీవన్ మిషన్లో భాగంగా రెండు పనులుగా రూ.2.42 కోట్లు, రూ.1.51 కోట్ల నిధులు మంజూరు చేశారు. కండలేరు సీపీడబ్ల్యూఎస్ నుంచి రాపూరు మార్గంలో పట్టణానికి పైపులైను నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఈ పైపులైను నుంచి మర్రిపల్లి (దిగువ) గ్రామానికి కూడా మంచినీటిని సరఫరా చేసేందుకు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను నిర్మించారు. కండలేరు మంచినీటిని అందించేందుకు పట్టణంలోని వినాయకమాన్యంలో ట్యాంక్‌ను కట్టారు. ప్రత్యేక పైపులైను నుంచి తరచూ పట్టణ తాగునీటి అవసరాల కోసం మంచినీటి విడుదల చేస్తున్నారు. ఇటీవల జెడ్పీ సీఈఓ విద్యారమ కండలేరు సీపీడబ్ల్యూఎస్‌ను పరిశీలించారు. అయితే ఈ పైపులైను నుంచి అధికారికంగా మంచినీటిని విడుదల చేయడం లేదు.

మంచి పథకం



గ్రామీణ తాగునీటి అవసరాల కోసం కండలేరు నుంచి ప్రత్యేక పైప్‌లైను నిర్మాణం చేపట్టి మధ్యలో మర్రిపల్లి గ్రామాన్ని కలపడం మంచిపరిణామం. ఈ పథకం వల్ల 24 గంటలు మంచినీరు సరఫరా అయ్యేందుకు అవకాశం ఉంటుంది. గతంలో సీపీడబ్ల్యూ స్కీమ్ నుంచి మంచినీరు సరఫరా అవుతున్నా సక్రమంగా అందేవి కాదు.

– కె.అంకమ్మ, సర్పంచ్, మర్రిపల్లి

పనులు పర్యవేక్షిస్తున్నాం

జల్‌జీవన్ మిషన్ పనుల వివరాలు పర్యవేక్షిస్తున్నాం. ఇటీవల బాధ్యతలు స్వీకరించడం వల్ల వివరాలు పూర్తిగా తెలియదు. కండలేరు పాత సీపీడబ్ల్యూఎస్ ద్వారా తాగునీటిని అందిస్తున్నాం. ప్రత్యేక పైపులైను పనులు దాదాపు పూర్తయ్యాయి. పూర్వ ఏఈ పర్యవేక్షణలో పనులు జరిగాయి.

– రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ, పొదలకూరు

విధులను బహిష్కరించిన స్టాఫ్ నర్సులు

పొదలకూరు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో అంతర్గత వివాదాలు తారస్థాయికి చేరుకున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం సీహెచ్‌సీలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు హెడ్ నర్సు తీరుకు నిరసనగా విధులను బహిష్కరించారు. డ్యూటీలను వేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడ హెడ్ నర్సు, స్టాఫ్ నర్సుల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్నట్టుగా తెలిసింది. నర్సులు చాలాసేపు విధులను నిర్వహించకపోవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ స్పందించి ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిర్చి విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి వివాదమేనని సర్దుబాటు చేసినట్టు వెల్లడించారు. ఇకపై ఇలాంటివి జరగకుండా చూసుకుంటామన్నారు.

వల్లూరు కండ్రిగలో అర్జీలు నిల్



సదస్సులో పాల్గొన్న అధికారులు

ముత్తుకూరు: మండలంలోని వల్లూరు కండ్రిగ రెవెన్యూ గ్రామంలో మంగళవారం జరిగిన సదస్సులో ఒక్క అర్జీ కూడా అధికారులకు రాలేదు. చిన్న రెవెన్యూ గ్రామం కావడం, భూ సమస్యలు లేకపోవడంతో అర్జీలు రాలేదని డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ వెల్లడించారు. తాళ్లపూడిలో జరిగిన ఈ సదస్సులో రీ సర్వే డీటీ శ్రీనివాసులు, వీఆర్వో, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి

పొదలకూరు: సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను కార్యకర్తలు, నాయకులు జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి రాజగోపాల్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో మహాసభలు జరుగుతాయన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నట్టు తెలిపారు. సోమశిల ఆఫ్రాన్ పనులను వెంటనే పూర్తి చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 3న నెల్లూరులో పార్టీ భారీ ర్యాలీ నిర్వహిస్తున్నారు. కార్యకర్తలు హాజరు కావాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.మనోహర్, రంగయ్య, జి.మణి, యానాదిరెడ్డి, పాండు, పెంచలయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరించిన నాయకులు

బీటీఏ సభ్యత్వ నమోదు

పొదలకూరు: బహుజన టీచర్స్ అసోసియేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు వెళ్లి సభ్యత్వాలను నమోదు చేయించారు. నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర కార్యదర్శి ఊట్ల రఘు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.చక్రపాణి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.మహేంద్రకుమార్, అధ్యక్షుడు వి.హజరత్తయ్య, కార్యదర్శి కె.శీనయ్య తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వాలను నమోదు చేయిస్తున్న బీటీఏ నాయకులు

ఎమ్మెల్యే పర్యటన

ముత్తుకూరు: సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం మండలంలోని పైనాపురం పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా చిన్న సంఘంను పరిశీలించి సదుపాయాల కల్పనపై స్థానికులతో చర్చించారు. అనంతరం ముత్తుకూరులో పర్యటించారు. అన్న క్యాంటీన్, కళ్యాణ మండపం, పార్టీ కార్యాలయం నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. పైనాపురం సర్పంచ్ పట్టపు విజయకుమార్, నాయకులు ఈదూరు రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓను కలిసిన హెచ్‌ఎం

పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీ కూల్చివేత తదితర పరిణామాలపై హెచ్‌ఎం ఫెర్సిస్ మంగళవారం జెడ్పీ సీఈఓ విద్యారమను నెల్లూరులో కలిశారు. ఈ సందర్భంగా పాఠశాల స్థలం తమదని ప్రైవేట్ వ్యక్తులు కొలతలు వేయిస్తున్నారని వెల్లడించారు. స్థలం ఎవరిదో తేల్చాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఈఓ రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. గురువారం స్థలాన్ని కొలతలు వేయించి నివేదిక సమర్పించనున్నట్టు వెల్లడించారు. హెచ్‌ఎం వెంట ఉపాధ్యాయుడు నాగిరెడ్డి కూడా ఉన్నారు.

తాటిపర్తిలో రోజూ ఫీవర్ సర్వే

- డీఎంహెచ్‌ఓ సుజాత

పొదలకూరు: మండలంలోని తాటిపర్తిలో జ్వరాలు అదుపులోకి వచ్చే వరకూ రోజూ ఫీవర్ సర్వేను కొనసాగించాల్సిందిగా డీఎంహెచ్‌ఓ బి.సుజాత ఆదేశించారు. మహ్మదాపురం పీహెచ్‌సీను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ పక్క గ్రామమైన తాటిపర్తిలో జ్వరాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో దోమల లార్వాను పూర్తిగా నాశనం చేయాల్సిందిగా సూచించారు. వైద్య శిబిరాన్ని కొద్దిరోజులు కొనసాగించాలని, పారిశుద్ధ్య పనులను వైద్య సిబ్బంది సైతం దగ్గరుండి పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఇంటింటి సర్వేలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ జ్వరపీడితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. ఏ గ్రామంలోనైనా ఐదుగురికి మించి జ్వరపీడితులు ఉంటే వెంటనే వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా వైద్యాధికారులను ఆదేశించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మహ్మదాపురం పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న ఆశావర్కర్ల సమావేశంలో డీఎంహెచ్‌ఓ పాల్గొని గ్రామాల్లో ఎప్పటికప్పుడు సమాచారం వైద్యాధికారుల దృష్టికి తీసుకురావాల్సిందిగా పేర్కొన్నారు. ఎవరైనా జ్వరాలతో బాధపడుతుంటే వెంటనే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నరసింహారావు, స్రవంతి, కిరణ్ రిషిత, సిబ్బంది పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

వవ్వేరు బ్యాంక్‌కు త్రిసభ్య కమిటీ నియామకం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంక్‌కు ఎన్నికలు జరగకపోవడంతో త్రిసభ్య కమిటీని నియమించేలా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చర్యలు చేపట్టారు. బుచ్చిరెడ్డిపాళెం మాజీ ఎంపీపీ దొడ్ల విజయలక్ష్మిని చైర్‌పర్సన్‌గా, కాగులపాడుకు చెందిన మాల్యాద్రి, సాల్మాన్‌పురానికి చెందిన నెల్లూరు వెంకటేశ్వర్లురెడ్డిను సభ్యులుగా నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది.

యాజమాన్య పద్ధతులను పాటించాలి



బుచ్చిరెడ్డిపాళెం: ఎరువుల వాడకంపై సూచనలు



కొడవలూరు: ఎలుకల నివారణపై రైతులకు అవగాహన

కోవూరు: సాగులో యాజమాన్య పద్ధతులను రైతులు తప్పక పాటించి.. అధిక దిగుబడులను సాధించాలని వ్యవసాయ శాఖ ఏడీ సుజాత కోరారు. మండలంలోని చెర్లోపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వ్యవసాయాధికారి ఇంద్రావతి, కెనరా బ్యాంక్ అధికారి రవిశంకర్, వ్యవసాయ సహాయకుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

⇨ బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాల, దామరమడుగులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి, వీఏఏ అనిత, పవన్‌కుమార్, వీహెచ్‌ఏ ప్రభ తదితరులు పాల్గొన్నారు.

⇨ కొడవలూరు: వరిలో సామూహిక ఎలుకల నివారణపై రైతలకు అవగాహన అవసరమని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని పెమ్మారెడ్డిపాళెం, కొత్తవంగల్లులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సామూహికంగా ఎలుకల నివారణను ప్రయోగాత్మకంగా తెలియజేశారు. అనంతరం బ్రోమోడైలిన్ మందును పంపిణీ చేశారు. ఏఈఓ వెంకట్రావు, వీఏఏలు మౌర్య, వంశీకృష్ణ, స్థానిక నేత కోడూరు విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



ముత్తుకూరులో..

⇨ ముత్తుకూరు: వరి పంటపై ఎలుకలు దాడి చేసి నాశనం చేసే ప్రమాదం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్నరాణి హెచ్చరించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా తాళ్లపూడిలో మంగళవారం రైతులకు ఎలుకల మందు తయారు చేసే విధానాన్ని చేసి చూపించారు. ఉచితంగా ఎలుకల మందు పంపిణీ చేశారు. వీఏఏ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరి అమ్మవారి దేవస్థానంలో హుండీ కానుకలను లెక్కించారు. గతేడాది సెప్టెంబర్ 17 నుంచి మంగళవారం వరకు కానుకల రూపంలో భక్తులు రూ.4,44,546 సమర్పించారు. అన్నప్రసాదాలకు సంబంధించి రూ.40,060ను అందజేశారు. కోవూరు గ్రూప్ టెంపుల్స్ ఈఓ కృష్ణప్రసాద్, కెనరా బ్యాంక్ మేనేజర్ సుబ్బారావు, విద్యాసాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి మహాకుంభాభిషేకం

దేవస్థానంలో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి రెండు వరకు మహాకుంభాభిషేకాన్ని నిర్వహించనున్నామని ఈఓ తాతా శ్రీనివాసరావు తెలిపారు. భక్తులు విశేషంగా తరలిరావాలని కోరారు.



బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

విడవలూరు: బాలికల సంరక్షణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని రిసోర్స్ పర్సన్లు పేర్కొన్నారు. కిశోరి వికాసంపై మండల స్థాయి శిక్షకులకు ట్రెయినింగ్‌ను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం వారు మాట్లాడారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు. గుడ్.. బ్యాడ్ టచ్ తదితరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. రిసోర్స్ పర్సన్లు రాధిక, ప్రమీల, అనూరాధ, రమణి, సుమిత్ర, పావని, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఎంఈఓ నాగపద్మ, మెడికల్ ఆఫీసర్ హరికృష్ణ, ఏపీఎం వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

⇨ కొడవలూరు: క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ బాల్య వివాహాలను అడ్డుకోవాలని ఎంపీడీఓ సుబ్బారావు సూచించారు. స్థానిక సంఘమిత్ర మండల సమాఖ్య కార్యాలయంలో కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమాన్ని మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఎస్సై కోటిరెడ్డి, ఎంఈఓ వసంతకుమారి, వైద్యాధికారి బాలచంద్రబాబు, ఈఓపీఆర్డీ సాయిప్రసాద్, ఏపీఎం కృష్ణవేణి, ఐసీడీఎస్ అధికారి పావనికుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, నిర్మల, నాగభూషణమ్మ, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

⇨ ఇందుకూరుపేట: కిశోరి వికాసంపై ఇందుకూరుపేటలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ రాజ్యలక్ష్మి, ఈఓపీఆర్డీ పెంచలశ్యామ్, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంఈఓ సునీల్‌కుమార్, ఏపీఎం సరిత, మెడికల్ ఆఫీసర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

⇨ పొదలకూరు: బాలికల ఉజ్వల భవిష్యత్‌కు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని వెంకటాచలం సీడీపీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ డీవీ నరసింహారావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బాలికా సంఘాలను ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా సూచించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం చిన్నయ్య, వైద్యాధికారి కావ్యశ్రీ, ఎంఈఓలు రేణుక, శోభనాద్రి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మజ, జ్యోతిలక్ష్మి, నారాయణమ్మ, హెచ్‌సీ అక్తర్‌బాషా, వెలుగు సీసీలు పాల్గొన్నారు.



విడవలూరులో శిక్షణ

విద్య ముఖ్య సాధనం

⇨ వెంకటాచలం: మహిళా సాధికారతకు విద్య ముఖ్య సాధనమని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో మంగళవారం వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ బాల్య వివాహాలు వ్యక్తుల జీవితాలను ప్రభావితం చేయడమే కాకుండా సమాజ ప్రగతిని అడ్డుకుంటాయని చెప్పారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు యువతుల చైతన్యంతోపాటు, సమాజం మొత్తం భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి, సుజా ఎస్ నాయర్, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ప్రోగ్రాం అధికారి బీవీ సుబ్బారెడ్డి, జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్, ఐసీడీఎస్ పీడీ సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

⇨ మనుబోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జలజాక్షి, ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఎం వనజాక్షి, బాలికల హైస్కూల్ హెచ్‌ఎం వసంతకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమణమ్మ, పద్మజ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు: పోస్టర్ల ఆవిష్కరణ



వెంకటాచలం: మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ



మనుబోలు: మాట్లాడుతున్న సీడీపీఓ